సాక్షి
వికారాబాద్

గురువారం, 2, జనవరి, 2025



అప్రమత్తంగా ఉండాలి

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్ గఫార్ ప్రజలకు సూచించారు. 8లో ▶



ఆదమరిస్తే ముప్పు

ప్రస్తుత సీజన్‌లో పశువులకు గొంతు వాపు వ్యాధి సోకే ప్రమాదం ఉన్నందున రైతులు జాగ్రత్తలు పాటించాలి. 8లో ▶



వంద శాతం లక్ష్యం

పదో తరగతిలో వందశాతం లక్ష్యంగా ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. 9లో ▶

న్యూస్‌రీల్

సీఎం రేవంత్‌రెడ్డికి నూతన శుభాకాంక్షలు



పరిగి: సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం పరిగి ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి నగరంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అన్నీ శుభాలే కలగాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీఎం సూచించినట్లు ఆయన తెలిపారు.

హ్యాపీ న్యూ ఇయర్..



తాండూరు: తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు. అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

అనంతగిరి: తమ సమస్యలను పరిష్కరించే దాకా ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాంగ్యానాయక్ అన్నారు. వికారాబాద్‌లోని ఆర్‌డీఓ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె బుధవారం నాటికి 27వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. ఎస్‌ఎస్‌ఏను విద్యాశాఖలో విలీనం చేయాలన్నారు. తక్షణమే పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవికుమార్, శ్రీశైలం, రఘుసింగ్ ఠాకూర్, బ్రహ్మయ్య చారి, లక్ష్మయ్య, ప్రమోద్, శేఖర్, వసంత, శ్రీనివాస్, రవి, మోహన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో ఎద్దు మృతి



పాము కాటుతో మృతిచెందిన ఎద్దు

కుల్కచర్ల: పాము కాటు వేయడంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం ..పుట్టపహాడ్ గ్రామానికి చెందిన చిల్ల బుగ్గయ్య అనే రైతు పొలాన్ని కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఎద్దును పాము కాటేసింది. కొద్ది సేపటికే అది కుప్పకూలి చనిపోయింది. సుమారు రూ.80 వేల విలువ చేసే ఎద్దు మృతి చెందడం పట్ల బాధిత రైతు మనోవేదనకు గురయ్యారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరారు.

విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

అనంతగిరి: నగరంలో ఈ నెల 7న తలపెట్టిన లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు.. అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్వామిదాస్ పిలుపునిచ్చారు. బుధవారం వికారాబాద్‌లో ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకుల సమావేశం జరిగింది.ఈ సందర్భంగావారు మాట్లాడుతూ..ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు అడ్డుపడుతున్న దుష్టశక్తులను తిప్పి కొట్టి.. వారి గుండెలదిరేలా ప్రతి ఒక్కరూ డప్పులతో హైదరాబాద్‌ను ముట్టడించి దండోరా మోగించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆనంద్, మల్లికార్జున్, ప్రకాష్,మహేందర్, కృష్ణనరసింహ, మల్కప్ప, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

కొత్త జోష్

కొత్త సంవత్సరం వేడుకలను జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం రాత్రి నుంచే వేడుకల్లో మునిగితేలారు. అర్ధరాత్రి 12గంటలు కాగానే కేక్ కట్ చేసి 2025 సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. అలాగే 2024కు వీడ్కోలు చెప్పారు. కోట్‌పల్లి ప్రాజెక్టుకు, అనంతగిరి గుట్టకు పెద్ద సంఖ్యలో పర్యాటకులు వచ్చి న్యూ ఇయర్ వేడుకలు చేసుకున్నారు. జిల్లాలోని ప్రముఖ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ప్రజాప్రతినిధులు, నేతలు, అధికారులు ఆకాంక్షించారు.



కుల్కచర్ల: పాంబండ ఆలయంలో భక్తుల క్యూ



బొంరాస్‌పేట: నూతన సంవత్సర వేడుకల్లో యువకులు



అనంతగిరి: కేరింతలు కొడుతున్న యువకులు



అనంతగిరి అనంతపద్మనాభ స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

అభయహస్తం దరఖాస్తులకు ఏడాది



ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే, అధికారులు (ఫైల్)

గత ఏడాది జనవరి మొదటి వారంలో అర్జీల స్వీకరణ

- ఆరు గ్యారంటీల్లో అమలుకు నోచుకుంది రెండే
- జిల్లాలో మొత్తం కుటుంబాలు 1,94,956
- వచ్చిన దరఖాస్తులు 3,14,090
- ఐదు గ్యారంటీలకు వచ్చినవి 2,74,470

వికారాబాద్: ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం పేరిట గత ఏడాది జనవరి మొదటి వారంలో ప్రజల నుంచి ఆరు గ్యారంటీల కోసం దరఖాస్తులు స్వీకరించారు. అర్జీలు తీసుకొని ఏడాదైనా కేవలం రెండు గ్యారంటీలను మాత్రమే అమలుకు నోచుకున్నాయి. మిగతావి ఎప్పుడు అమలు చేస్తారనే విషయంపై స్పష్టత లేదు. ఇందులో రైతు భరోసా సంక్రాంతి పండుగ కానుకగా అమలు చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. మరో గ్యారంటీ ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సర్వే చేస్తున్నా అవి ఎప్పుడు ప్రారంభిస్తారనే విషయం తెలియడం లేదు. మహాలక్ష్మి, చేయూత పథకాల ఊసే లేదు. దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వచ్చింది. కుటుంబాల సంఖ్య కంటే అర్జీలే ఎక్కువగా వచ్చాయి. జిల్లాలోని 18 మండలాలు, నాలుగు మున్సిపాలిటీల్లో ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

ఐదు గ్యారంటీల కోసం..

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా మహాలక్ష్మి పథకం, రైతు భరోసా, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయుత పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తున్నారు.

అంచనాలకు మించి అర్జీలు

ఆరు గ్యారంటీల కోసం అంచనాలకు మించి దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో మొత్తం 1,94,956 కుటుంబాలు ఉండగా 3,14,090 అర్జీలు వచ్చాయి. ఇందులో ఐదు గ్యారంటీలకు సంబంధించి 2,74,470 వచ్చాయి. రేషన్ కార్డులు, భూ సమస్యలకు సంబంధించి 39,620 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక ఏర్పాటైన తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇవ్వకపోవటం, ధరణికి సంబంధించి వేల సంఖ్యలో సమస్యలు పేరుకుపోవడం వంటి సమస్యలకు సంబంధించి దరఖాస్తులు వచ్చాయి. ఐదు గ్యారంటీల కోసం తాండూరు మున్సిపాలిటీలో అత్యధికంగా 17,065 దరకాస్తులు రాగా వికారాబాద్ మున్సిపాలిటీ, దోమ, బొంరాస్‌పేట్ మండలాల్లో 16 వేలకు పైగా అర్జీలు వచ్చాయి. కొడంగల్ మున్సిపల్ పరిధిలో అత్యల్పంగా 3,414 దరఖాస్తులు వచ్చాయి.

సాగునీరు అడవిపాలు



కల్వర్టు దెబ్బతినడంతో వృథాగా పోతున్న నీరు

- దెబ్బతిన్న కోట్‌పల్లి బేజీ కెనాల్ కల్వర్లు
- ఆందోళనలో రైతన్న

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు బేబీ కేనాల్‌పై నిర్మించిన 3వ కల్వర్టు దెబ్బతినడంతో పంట పొలాలకు చేరాల్సిన నీరు వృథాగా అడవిలోకి ప్రవహిస్తోంది. రబీ పంటల కోసం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశారు. బూర్గుగడ్డకు వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు పగిలిపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రైతులు నీటి వృథాను గుర్తించి ప్రాజెక్టు సిబ్బంది, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. బేబీ కెనాల్ తూము షట్టర్ సరిగ్గా పనిచేయడం లేదని, షట్టర్ పూర్తిగా కిందకు దిగకపోవడంతో కాలువలో ఎక్కువ నీరు పోతోందని రైతులు తెలిపారు. ఈ కారణంగానే కల్వర్టు దెబ్బతిని నీరు అడవిలోకి వృథాగా పోతోందన్నారు. ఈ విషయాన్ని ఏఈ మాధవిలత దృష్టికి తీసుకెళ్లగా సమస్యను వర్క్ ఇన్‌స్పెక్టర్ వివరించి పరిష్కరిస్తామని తెలిపారు.

కొత్త కిక్కు రూ.కోట్లలో..

- ఉమ్మడి జిల్లాలో చివరి మూడు రోజుల్లో రూ.207.95 కోట్ల ఆదాయం
- 1,74,166 కేసుల మద్యం, 2,03,609 కేసుల బీర్ల అమ్మకాలు
- గతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గిన ఆదాయం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 2024 డిసెంబర్ చివరి మూడు (29, 30 ,31 తేదీల్లో) రోజుల్లో ప్రభుత్వానికి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మద్యం అమ్మకాలు కాసుల వర్షం కురిపించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో ఐదు ఎక్సైజ్ జిల్లాలు ఉండగా, వీటి పరిధిలో 20 ఎక్సైజ్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. 2023 డిసెంబర్ చివరి మూడు రోజులతో పోలిస్తే.. 2024 డిసెంబర్ చివరి మూడు రోజుల్లో ఆదాయం కొంత తగ్గినప్పటికీ (రూ.75 లక్షల).. కేవలం మూడు రోజుల్లోనే రూ.207.95 కోట్ల ఆదాయం సమకూరడం విశేషం. జిల్లా వాసులంతా పాత(2024) సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ..కొత్త(2025) సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. యువతీ, యువకులు డిసెంబర్ 31 మధ్యాహ్నం నుంచే వేడుకల్లో మునిగితేలారు. బార్లు, వైన్స్ మందుబాబులతో కిక్కిరిసి పోయాయి. మద్యంతో పాటు కూల్ డ్రింక్స్, కేకులు, చికెన్, మటన్, చేపల అమ్మకాలు భారీగా జరిగాయి. 2023 చివరి మూడు రోజులతో పోలిస్తే 2024లో మేడ్చల్, శంషాబాద్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో ఆదాయం కొంత తగ్గగా, మల్కాజ్‌గిరి, సరూర్‌నగర్, వికారాబాద్ ఎక్సైజ్ జిల్లాల పరిధిలో అమ్మకాలు కొంత పెరగడం విశేషం.

ఉమ్మడి జిల్లాలో 2023, 24లో మద్యం అమ్మకాలు

అంశం	2023			2024		
ఎక్సైజ్‌జిల్లా	మద్యం	బీర్లు	ఆదాయం రూ.కోట్లలో	మద్యం	బీర్లు	ఆదాయం రూ.కోట్లలో
మేడ్చల్	42545	37618	46.67	40220	46914	45.93
మల్కాజ్‌గిరి	39835	36658	44.71	40221	38248	45.92
సరూర్‌నగర్	40236	44310	45.81	42563	49966	49.58
శంషాబాద్	47781	48494	62.36	41414	53337	56.77
వికారాబాద్	9799	10734	9.15	9748	15144	9.75
మొత్తం	180196	177814	208.70	174166	203609	207.95

పది పరీక్షలకు 80రోజులే!

టెన్త్‌లో ర్యాంకులు, గ్రేడింగ్ విధానానికి స్వస్తి

- సబ్జెక్టుల వారీగా రివిజన్లు, ప్రాక్టీస్ టెస్టులు
- పదో తరగతి వార్షిక పరీక్షలకు ప్రిపరేషన్
- చూచిరాతలకు ఆస్కారం లేకుండా చర్యలు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ పాఠశాల్లో పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచడమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వార్షిక పరీక్షలకు మరో 80 రోజుల గడువే ఉండటంతో ఆ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. సంక్రాంతి లోపే పాఠ్యాంశాల బోధనను పూర్తి చేయించాలని నిర్ణయించింది. ర్యాంకులు, గ్రేడింగ్ విధానానికి ఇప్పటికే స్వస్తి పలికిన నేపథ్యంలో పాఠ్యాంశాల వారీగా పునఃశ్చరణ తరగతులు సహా ముందస్తు ప్రాక్టీస్ టెస్టులను నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. తద్వారా వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిని పరీక్షలకు సిద్ధం చేసే అవకాశం ఉంటుందని భావిస్తోంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. వీరికి జనవరి చివరి వారంలో ఒక టెస్టు, ఫిబ్రవరిలో రెండు, మార్చిలో మరో టెస్టు ఇలా మొత్తం ఐదు టెస్టులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

పకడ్బందీగా పరీక్షలు

జిల్లాలో 1163 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 51,806 మంది విద్యార్థులు ఈ వార్షిక పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో 28,039 మంది బాలురు, 23,767 మంది బాలికలు ఉన్నారు. అత్యధికంగా 34,898 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి హాజరు కానున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు అనగానే చూచిరాతలకు వేదిక అనే అపవాదు నెలకొని ఉన్న విషయం తెలిసిందే. జబ్లింగ్ విధానంలో పరీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ.. ఉత్తీర్ణత శాతం పెంపు పేరుతో పరీక్షలను, మూల్యాంకణాన్ని కొంత సులభతరం చేశారు. ఇకపై వీటికి ఏమాత్రం ఆస్కారం లేకుండా అత్యంత పకడ్బందీగా పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించాలని జిల్లా యంత్రాంగం భావిస్తోంది. కోవిడ్‌తో నిలిచి పోయిన సిట్టింగ్ స్క్వాడ్‌లను మళ్లీ రంగంలోకి దించనుంది. గతానికి భిన్నంగా ప్రతీ సెంటర్‌కు ఒక సిట్టింగ్ స్క్వాడ్ సహా 15 స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది.

వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు

యాజమాన్యం	పాఠశాలలు	విద్యార్థులు
ఎయిడెడ్	04	156
జీసీ రెసిడెన్షియల్	16	1,030
ప్రభుత్వ స్కూళ్లు	04	322
కేజీబీవీలు	20	932
మైనార్టీ రెసిడెన్షియళ్లు	09	492
టీఎస్ఎంఎస్	09	783
టీటీడబ్ల్యూఆర్ఎస్	03	173
టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్	15	1,133
ఆశ్రమ పాఠశాలలు	01	47
జిల్లా పరిషత్	238	11,840
ప్రైవేటు స్కూళ్లు	844	34,898

“ విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం

మార్చి 21 నుంచి ఏప్రిల్ నాలుగు వరకు పదో తరగతి వార్షిక పరీక్షలు నిర్వహించనుంది. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇటీవల నిర్వహించిన మాథ్స్ ఒలింపియాడ్ సహా ఎస్‌ఏ-1లో సరూర్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, గచ్చిబౌలి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ప్రైవేటు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల కంటే అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. ర్యాంకులు, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో విద్యార్థులు మంచి మార్కులు సాధించే దిశగా వారిని సంసిద్ధులను చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. ఆత్మస్థైర్యాన్ని నింపి, మానసికంగా వారిని పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం.

– సుశీందర్‌రావు, డీఈఓ, రంగారెడ్డి

క్లుప్తంగా

బీసీ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ జిల్లా ఇన్‌చార్జిగా శ్రీనివాస్‌గౌడ్‌



తాండూరు టౌన్‌: తెలంగాణ బీసీ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ జిల్లా ఇన్‌చార్జిగా తాండూరు ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఇంగ్లిష్‌ లెక్చరర్‌ శ్రీనివాస్‌గౌడ్‌ నియామకమయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో జిల్లా ఇన్‌చార్జిగా ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ గౌడ్‌ మాట్లాడుతూ.. లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న స్కాలర్‌షిప్‌లు, తదితర ప్రోత్సాహకాలపై అవగాహన కల్పిస్తానన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన బీసీ లెక్చరర్స్‌ అసోసియేషన్‌ గౌరవాధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు కామని సుదర్శన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పీసీసీ కో ఆర్డినేటర్‌గా పురుషోత్తంరావు


నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

తాండూరు: పీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా యాలాల మండల మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తంరావు నియమితులయ్యారు. ఈ మేరకు పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌ ఉత్తర్వులు జారీ చేశారు. పురుషోత్తంరావు సీనియర్‌ రాజకీయ వేత్తగా, న్యాయవాదిగా స్థానికంగా గుర్తింపు పొందారు. బుధవారం ఆయనకు తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరిగే మున్సిపల్‌, స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తానన్నారు.

4 నుంచి యువజన వారోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కుల్కచర్ల: స్వామి వివేకనంద జయంతిని పురస్కరించుకొని ఈ నెల 4వ తేదీ నుంచి 12 వరకు యువజన వారోత్సవాలు నిర్వహిస్తామని పరిరక్షణ సంఘం పరిగి వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌ గౌడ్‌ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ స్థాయిలో వివేకనంద యువజన వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో సాయికిరణ్‌ గౌడ్‌, హరికృష్ణ, శివ, కొండ ఆంజనేయులు, మహేందర్‌, రాఘవేందర్‌, వెంకటేష్‌, రవితేజ పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన నయిం



తాండూరు: బీఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌ను పార్టీ తాండూరు పట్టణ అధ్యక్షుడు నయిం (అప్పు) బుధవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో 10 కేసులు

అనంతగిరి: న్యూయర్‌ సందర్భంగా పోలీసులు ప్రత్యేక పికెటింగ్‌ నిర్వహించి డ్రంక్‌ అండ్‌ డ్రైవ్‌ చేపట్టారు. మంగళవారం రాత్రి నుంచి అర్ధరాత్రి దాటినంత వరకు పోలీసులు చెకింగ్‌ చేపట్టారు. 10 వరకు కేసులు నమోదయినట్లు పోలీసులు తెలిపారు. కాగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట భద్రత చర్యలు తీసుకున్నారు.

గొంతువాపు.. ఆదమరిస్తే ముప్పు

- ఉష్ణోగ్రతలు తగ్గడంతో పశువులకు సంక్రమించే అవకాశం
- వ్యాధి ముదిరితే పోషకులకు తీవ్ర నష్టం
- జాగ్రత్తలు పాటించాలని నిపుణుల సూచన


పశువులకు వైద్యం చేస్తున్న వైద్యాధికారులు

దుద్యాల్‌: ప్రస్తుత సీజన్‌లో పశువులకు గొంతు వాపు వ్యాధి ప్రమాదం పొంచి ఉంది. వాతావరణంలో మార్పులతో అప్పుడప్పుడు తేలికపాటి వర్షాలు పడుతున్నాయి. దీనికి తోడు మరోపక్క చలి తీవ్రత పెరిగింది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని పశువుల యజమానులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని దుద్యాల్‌ మండల పశువైద్యాధికారులు సూచించారు. వ్యాధి లక్షణాలు, జాగ్రత్తలు, నివారణ చర్యలను వివరించారు.

వ్యాప్తి చెందే విధానం

గొంతు వాపు వ్యాధి ముఖ్యంగా గేదెలు, దున్నలలో అధికంగా కనిపిస్తుంది. ఆవులు, దూడల్లో కాస్త తక్కువగా ఉంటుంది. వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గినప్పుడు, వర్షంలో ఎక్కువగా తడిసినప్పుడు, అటు ఎండుగడ్డి.. ఇటు పచ్చి గడ్డి మేసినప్పుడు ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో వ్యాధికారక సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పశువులు ప్రమాదాలకు గురవుతాయి. అలాంటి పశువులు మేత తినవు, నీరసించి అలసటగా కనిపిస్తాయి. వ్యాధి సోకిన పశువు నుంచి మరో దానికి వ్యాప్తి చెందుతుంది.

లక్షణాలు

గొంతు వాపు వ్యాధి సోకిన పశువుల్లో దవడల మధ్య గొంతు పైభాగాన, మెడ కింద వాపు వస్తుంది. ఈ వాపులో రక్తం కనిపిస్తుంది. కళ్లు ఎర్రగా తయారై నీరు కారుతుంటాయి. పశువులు ఆయాసంతో శ్వాస పీలుస్తూ శబ్దం చేస్తుంటాయి. తీవ్ర జ్వరానికి గురవుతాయి. పశువులు మేత సరిగ్గా తినకపోయినా అలసటగా కనిపించి నాలుక బయటకు పెడుతాయి. అలాంటి పశువులు 24 గంటల్లో చనిపోయే అవకాశం కూడా ఉంటుంది.

మండలంలో పశువుల వివరాలు

ఆవులు :	3785
గేదెలు :	3486
గొర్రెలు :	3774
మేకలు :	7155
పందులు:	2144

నివారణ మార్గాలు

- వ్యాధి లక్షణాలు కనిపించిన పశువులను వెంటనే దగ్గర్లోని పశువైద్య కేంద్రాలకు తీసుకెళ్లాలి.
- యాంటి బయాటిక్‌ మందులు వేయించాలి.
- వ్యాధి సోకిన పశువులు, గేదెలను మిగతా వాటిలో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వైద్యుల సూచనల మేరకు తరచూ పాకల్లో వ్యాధికి సంబంధించిన రసాయనిక, క్రిమి సంహారక మందులను చల్లుతుండాలి.
- వ్యాధి సోకిన పశువులు తినగా మిగిలిన గడ్డిని కాల్చి వేయాలి.
- మల మూత్రాలను గుంతలో పూడ్చి వేయాలి.
- ఒకవేళ వ్యాధి తీవ్రత ఎక్కువై చనిపోతే వాటి కళేబరాలను లోతుగా గుంత తీసి పాతి పెట్టాలి.
- ముందు జాగ్రత్తల్లో భాగంగా టీకాలు అన్ని పశువులకు వేయించాలి.

అప్రమత్తంగా ఉండాలి



పశువుల యజమానులు అప్రమత్తంగా ఉండాలి. ఉష్ణోగ్రతలు తగ్గడంతో గొంతువాపు వ్యాధి సంక్రమించే అవకాశం ఉంది. నిత్యం పశువులను పాకలో పరిశీలించాలి. ఉదయం మేతకు విడిచినప్పుడు, మధ్యాహ్న సమయాల్లో ఒక్కో దాన్ని శ్రద్ధగా గమనించాలి. ఇబ్బందులు పడుతున్నాయా.. ఆరోగ్యంగా ఉన్నాయా అని బేరీజు వేసుకోవాలి. వాటికి ముందస్తుగా టీకాలు వేయించడం మంచిది.

– ప్రమీల, ఇన్‌చార్జి పశువైద్యాధికారి, దుద్యాల్‌

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ఎస్‌ఐ అబ్దుల్‌ గఫార్‌


గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

బంట్వారం: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్‌ఐ అబ్దుల్‌ గఫార్‌ ప్రజలకు సూచించారు. బుధవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని కరీంపూర్‌ గ్రామాన్ని సందర్శించి కమ్యూనిటీ పోలీసింగ్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎవరైనా అనుమానితులుగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్‌ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, బాల్య వివాహాలు తదితర అంశాలపై ఆయన ప్రజలకు వివరించారు. కులమతాలకు అతీతంగా సోదరభావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. కార్యక్రమంలో కరీంపూర్‌ మాజీ సర్పంచ్‌ సుందరి అనిల్‌, గ్రామస్తులు, పోలీస్‌ సిబ్బంది పాల్గొన్నారు.

పాంబండకు పోటెత్తిన భక్తజనం

కుల్కచర్ల: నూతన ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామ పరిధిలోని శ్రీ పాంబండ రామలింగేశ్వర దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.


ఆలయంపై భక్తుల సందడి

మోడువారిన చెట్టుకు గిజిగాడి గూళ్లు


తుమ్మ చెట్టుకు వేలాడుతున్న గూళ్లు

దుద్యాల్‌: అద్భుత నైపుణ్యంతో గిజిగాడు నిర్మించిన వేలాడే గూళ్లు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మండల పరిధిలోని ఆలేడ్‌ గ్రామ చెరువు సమీపంలో ఓ మోడువారిన తుమ్మ చెట్టుకు గిజిగాళ్లు నిర్మించుకున్న గూళ్లు అటుగా వెళ్లే వీక్షకులను కనువిందు చేస్తున్నాయి. పాముల బారిన నుంచి గుడ్లు, పిల్లలను కాపాడుకోవడానికి గూళ్లను ముళ్ల చెట్ల పైన కిందికి వేలాడే రీతిలో కట్టుకోవడం వీటి ప్రత్యేకత.



పెట్టుబడి సాయం పెంపు హర్షణీయం

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న కిసాన్‌ సమ్మాన్‌ నిధిని రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు పెంచడం హర్షణీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయంతో యావత్‌ దేశంలోని రైతులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

అనంతగిరి: నూతన సంవత్సరం వేడుకల కోసం హైదరాబాద్‌ నుంచి వికారాబాద్‌ సమీపంలోని రిసార్ట్‌కు వెళ్తున్న ఓ కుటుంబం కారు ప్రమాదానికి గురైంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. మంగళవారం అర్ధరాత్రి వికారాబాద్‌ సమీపంలోని గోధుమగూడ పరిసర ప్రాంతాల్లో కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ప్రయాణిస్తున్న వారికి గాయాలయ్యాయి. వెంటనే వికారాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి క్షతగాత్రులను తరలించారు. ఈ విషయమై పీఎస్‌కు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

పాలానికి వెళ్లిన వృద్ధురాలి అదృశ్యం


నర్సమ్మ (ఫైల్‌)

కుల్కచర్ల: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన కులకచర్ల మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుల్కచర్ల గ్రామానికి చెందిన శివ్వని నర్సమ్మ(69) మంగళవారం పొలం దగ్గరకు వెళ్లి తిరిగి రాలేదు. పొలం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో నర్సమ్మ కుమారుడు భీమయ్య బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అరచేతిని అడ్డుపెట్టి భర్తను కాపాడిన భార్య

మాంజాదారం తగిలి దంపతులకు తీవ్ర గాయాలు


రక్తం కారుతున్న సంతోషిని చేయి


రఘునాథ్‌ గొంతుకు అయిన గాయం

షాద్‌నగర్‌: బైక్‌పై వస్తున్న దంపతులకు మాంజా దారం తగలడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. భర్త గొంతుకు భార్య చేతిని అడ్డు పెట్టడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన బుధవారం నందిగామ శివారులో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నందిగామ గ్రామానికి చెందిన రఘునాథ్‌, సంతోషిని దంపతులు బైక్‌పై షాద్‌నగర్‌కు బయలుదేరారు. నందిగామ దాటి కొద్ది దూరం రాగానే దంపతులకు రోడ్డుకు అడ్డుగా మాంజా దారం కనిపించింది. ప్రమాదం జరుగుతుందని ముందే గ్రహించిన సంతోషిని భర్త గొంతుకు తన చేతులను అడ్డుగా పెట్టింది. దీంతో ఆమె రెండు చేతులకు, రఘునాథ్‌ గొంతుకు గాయాలయ్యాయి. వెంటనే భార్యాభర్తలు చికిత్స నిమిత్తం బైక్‌పై ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. వారికి పరీక్షించిన వైద్యులు సంతోషిని చేతులకు 6 కుట్లు వేశారు. రఘునాథ్‌ గొంతుకు చికిత్స అందించి ఇంటికి పంపించారు. భార్య చేతిని భర్త గొంతుకు అడ్డుగా పెట్టకపోతే పెద్ద ప్రమాదం జరిగేదని వైద్యులు తెలిపారు.

షార్ట్‌ సర్క్యూట్‌తో షాపు దగ్ధం

రూ.2 లక్షల మేర ఆస్తి నష్టం



మంటలను అదుపు చేస్తున్న ఫైర్‌ సిబ్బంది

తాండూరు టౌన్‌: షార్ట్‌ సర్క్యూట్‌తో ఓ టైలర్‌ షాపు దగ్ధమైన ఘటన బుధవారం తాండూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఈ ఘటనలో షాపులోని పలు కుట్టు మిషన్లు దగ్ధమై సుమారు రూ.2 లక్షల మేరకు ఆస్తినష్టం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని వినాయక్‌ చౌక్‌లో రాంచందర్‌కు చెందిన విక్టరీ టైలర్‌ షాపులో బుధవారం ఉదయం షార్ట్‌ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. దీంతో షాపులో ఉన్న కుట్టుమిషన్లతో పాటు దుస్తులు కాలి బూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. 2లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు ఫైర్‌ సిబ్బంది తెలిపారు. షార్ట్‌ సర్క్యూట్‌ కారణంగా జీవనోపాధి కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని యజమాని రాంచందర్‌ కోరారు.

మైసిగండిలో భక్తుల కిటకిట


రద్దీగా ఉన్న క్యూ లైన్లు

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు


ఆలయంలో భక్తుల తాకిడి

కడ్తాల్‌: మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో కొలువైన మైసమ్మ తల్లిని బుధవారం భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం కావడంతో మైసిగండి ఆలయ పరిసరాలు భక్తజనంతో నిండిపోయింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వాహన పూజలు నిర్వహించడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్‌ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్‌, ఆలయ అర్చక సిబ్బంది తదితరులు ఉన్నారు.

తండా నుంచి హీరోగా ఎదగడం అభినందనీయం


హీరో దేవేందర్‌నాయక్‌తో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

కడ్తాల్‌: మండల పరిధిలోని టాక్‌రాజ్‌గూడతండాకు చెందిన ఇస్లావత్‌ దేవేందర్‌నాయక్‌ హీరోగా నటించిన 'సలాం సైనిక' సినిమా వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మారుమూల తండా నుంచి హీరోగా ఎదిగిన దేవేందర్‌నాయక్‌తో పాటు చిత్రం యూనిట్‌ను అభినందించారు. ఈనెల 24న సినిమా విడుదల కానుంది. కార్యక్రమంలో సీసీబీ మెంబర్‌ బాలాజీసింగ్‌ తదితరులు ఉన్నారు.

లక్ష మందితో బీసీ గర్జన

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లాల్‌కృష్ణ


ఆర్‌.కృష్ణయ్యను సన్మానిస్తున్న లాల్‌కృష్ణ తదితరులు

పరిగి: పరిగి పట్టణ కేంద్రంలో మార్చి చివరి వారంలో లక్ష మందితో బీసీ గర్జన నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ లాల్‌కృష్ణ తెలిపారు. ఆర్‌.కృష్ణయ్య రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీసీల సింహగర్జన నిర్వహణపై బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్‌.కృష్ణయ్యతో చర్చించామన్నారు. పరిగి పట్టణ కేంద్రంలోనే లక్ష మందితో సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ అడ్వకేట్‌ ఆనంద్‌గౌడ్‌, నాయకులు రాముయాదవ్‌, చిన్ననర్సింహులు, వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

కారు–బైక్‌ ఢీ

- ప్రమాదంలో వలస కార్మికుడి దుర్మరణం
- మరొకరికి తీవ్ర గాయాలు


దీప్‌ చంద్రకుమార్‌ మృతదేహం

మహేశ్వరం: పొట్టకూటి కోసం వలసొచ్చిన ఓ కార్మికుడిని రోడ్డు ప్రమాదం బలి తీసుకుంది. ఇదే ఘటనలో మరో శ్రమజీవి చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఎదురెదురుగా వస్తున్న కారు– బైక్‌ ఢీకొనడంతో ఒకరు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషాద సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరు గేటు శ్రీశైలం జాతీయ రహదారిపై మ్యాక్‌ ప్రాజెక్టు వద్ద చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన దీప్‌ చంద్రకుమార్‌(22), మనోజ్‌ కుమార్‌(23) ఇద్దరు స్నేహితులు. వీరు మహేశ్వరం గేటు వద్దనున్న పరిశ్రమలలో కార్మికులుగా పని చేస్తున్నారు. బుధవారం సాయంత్రం ఇద్దరు బైక్‌పై వ్యక్తిగత పనుల నిమిత్తం కందుకూరు వెళ్లి మహేశ్వరం గేటు వైపు తిరిగి వస్తున్నారు. మార్గ మధ్యలో తుమ్మలూరు గేటు సమీపం మ్యాక్‌ ప్రాజెక్టు వద్ద హైదరాబాద్‌ నుంచి అచ్చంపేట్‌ వైపు వెళ్తున్న కారు వీరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌ నడుపుతున్న దీప్‌చంద్రకుమార్‌ అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మనోజ్‌ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం 108 అంబులెన్సులో ఓ ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలికి మృతుడి బంధువులు, తోటి కార్మికులు చేరుకొని ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌ను అరెస్టు చేసి బాధితులను ఆదుకోవాలని నిరసన చేపట్టారు. దీంతో రోడ్డుపై వాహనాలు నిలవడంతో సమాచారం అందుకున్న మహేశ్వరం పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ని క్లియర్‌ చేశారు. మృతుడి బంధువులతో మాట్లాడి సద్దుమణిగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



ఏరువాక బాట.. కొంగల వేట

కందుకూరు: ఏరువాక సాగాలో రన్నో చిన్నన్న నీ కష్టమంత తీరునురో రన్నో చిన్నన్న.. అంటూ రైతులు సేద్యంలో నిమగ్నమయ్యారు. ప్రస్తుతం వరి నాట్లు వేయడానికి పొలాలను ట్రాక్టర్లతో దమ్ము చేస్తున్నారు. ఆ సమయంలో బయటికి వచ్చే పురుగులను తినడానికి కొంగలు మూకుమ్మడిగా తరలివచ్చి సందడి చేశారు. మండల పరిధిలోని జైత్వారం పరిధిలో ట్రాక్టర్‌తో దమ్ము చేస్తుండగా కొంగలు పెద్ద ఎత్తున వచ్చి పురుగులు తింటుండగా బుధవారం 'సాక్షి' కెమెరా బంధించింది.